## లింగన్నపేటలో నీటి ఎద్దడి



నీటి కోసం బారులుదీరిన గ్రామస్తులు

కోటపల్లి, ఏప్రిల్ 11 : కోటపల్లి మండలం లింగన్నపేటలో నీటి ఎద్దడి నెలకొన్నది. చేతి పంపులు పనిచేయకపోవడంతో ఊరికి దూరంలో ఉన్న చేతి పంపే పెద్ద దిక్కుగా మారింది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా మిషన్ భగీరథ అధికారులు తమ గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. నీటి ట్యాంక్ ద్వారా సరఫరా చేస్తూ గ్రామస్తులకు నీటి సరఫరా చేస్తున్నారు.

## వరిధాన్యం కొనుగోలుపై అవగాహన

జైపూర్, ఏప్రిల్ 11 : యాసంగి రైతులకు వరిధాన్యం కొనుగోలుపై వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ హాజరై, మాట్లాడారు. వరికోతల సమయం దగ్గర పడుతున్నందున నాణ్యమైన ధాన్యాన్ని పొందేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గింజ, ఆకులు పరిపక్వత చెందిన తరువాతనే కోతలు చేపట్టాలని తెలిపారు. కోతల సమయంలో హార్వెస్టర్ బ్లోయర్ 18-20 ఆర్పీఎం ఉండేలా చూడాలని, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం నిర్దిష్ట నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఏడీఏ ప్రసాద్‌నాయక్, తహసీల్దార్ వనజారెడ్డి, భీమారం, జైపూర్ మండలాల ఏవోలు మార్క్‌గ్లాడ్‌సన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

బెల్లంపల్లి, ఏప్రిల్ 11 : టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్‌ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్ తండ్రి రాజం అనారోగ్యంతో మృతి చెందగా, పట్టణంలోని స్టేషన్‌రోడ్ కాలనీలో గల ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. రాజం చిత్రపటం వద్ద పూలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ మంథని నాయకులు, బెల్లంపల్లి, మందమర్రి ఏరియా టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బ్యాంకర్ల నిర్లక్ష్యం.. చెల్లని కల్యాణ లక్ష్మి చెక్కు

కోటపల్లి, ఏప్రిల్ 11 : బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కల్యాణలక్ష్మి చెక్కు చెల్లకుండా పోయింది. ఈ ఘటన కోటపల్లి మండలంలో జరిగింది. నక్కలపల్లి గ్రామానికి చెందిన బొమ్మ శోభ ఇటీవల తన కూతురు వివాహం జరిపించింది. ఈమె పేరిట 2025, జనవరి 8న కల్యాణలక్ష్మి పేరిట రూ.1,00,116 చెక్కు మంజూరైంది. ఈ చెక్కును మార్చి 5న అధికారులు పంపిణీ చేయగా, అదే రోజు కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో డిపాజిట్ చేసింది. నెల రోజులు దాటినా ఖాతాలో డబ్బు జమకాకపోవడంతో శుక్రవారం బ్యాంక్‌ను సంప్రదించింది. చెక్కు గడువు ముగిసిందంటూ బ్యాంక్ అధికారులు ఆ చెక్కును వాపస్ ఇచ్చారని వాపోయింది. నెల రోజుల ముందు బ్యాంక్‌లో వేసినా అధికారులు ఏం చేశారని బాధితురాలు ప్రశ్నిస్తున్నది. బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వల్ల చెక్కు చెల్లకుండా పోయిందని వాపోతున్నది. చెల్లని చెక్కును తహసీల్ కార్యాలయంలో అందచేయగా, కొత్త చెక్కు మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ రాజేశ్‌ను వివరణ కోరగా.. టెక్నికల్ ఇష్యూ కారణంగా చెక్కు క్రెడిట్ కాలేదని తెలిపారు.

## పోషణ పక్వాడ సంబురాలు

తాండూర్, ఏప్రిల్ 11 : మండలంలోని మాదారం-3, కాసిపేట ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఇంటింటా పోషణ పక్వాడా సంబురాలు నిర్వహించారు. పిల్లలు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహారంపై స్టాళ్ల రూపంలో చూపించారు. విద్యార్థులతో ర్యాలీ తీసి, ఆరోగ్య సూత్రాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, కుష్నపల్లి మీనా, ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్త మల్లీశ్వరి, పోషకులు ఉన్నారు.

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 11 : మంచిర్యాలలోని హమాలీవాడలో గల అంగన్‌వాడీ కేంద్రం-1లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ జ్యోతి పౌష్టికాహారం, ముర్రుపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు రమ, ఆయా ఈశ్వరి, గర్భిణులు పాల్గొన్నారు.

## స్పెషల్ క్యాచ్‌అప్ టీకాల కార్యక్రమం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 11 : జిల్లాలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో స్పెషల్ క్యాచ్ అప్ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ అన్నారు. జిల్లా వైద్యాధికార్యాలయంలో శుక్రవారం వైద్యాధకారులు, ఎంఎల్‌హెచ్‌పీలతో జాతీయ టీకాల కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వంద శాతం టీకాలు అందజేయాలని, సరైన సమయంలో టీకాలు తీసుకొని పరిస్థితుల్లో ఉంటే వారికి టీకాలు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఉపవైద్యాధికారి అనిత, వైద్యులు కృసాబాయి, ప్రసాద్, డెమో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## 20 నుంచి ఓపెన్ పరీక్షలు

నస్పూర్, ఏప్రిల్ 11 : జిల్లాలో 20 నుంచి 26 వరకు ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు మంచిర్యాల డీఈవో యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలురు, బాలికలు, గర్మిళ్ల ప్రభుత్వ, ఆర్‌బీహెచ్‌వీ, చెన్నూర్ రోడ్డు, బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ, బాలికల, బజార్ ఏరియా ఉన్నత పాఠశాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినటుల పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు.

## బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా శిబిరం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 11 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కస్టమర్ సర్వీస్ మంత్‌లో భాగంగా శుక్రవారం వినియోగదారుల సేవా శిబిరం నిర్వహించారు. సమస్యలు, సంకేతాలు రాకపోవడం, ఎఫ్‌టీటీహెచ్ సమస్య, ఇంటర్‌నెట్ వేగం తగ్గిపోవడం టెలిఫోన్ బిల్లు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవెళ్లారు. కొన్ని అక్కడే పరిష్కరించి, ఇతర సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇక నుంచి వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఈ రవికుమార్, చంద్రమౌళి, సురేందర్, రాజేశం, తిరుపతి, రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏడీఏ అనిత

లక్షెట్టిపేట, ఏప్రిల్ 11 : మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఏడీఏ బత్తుల అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు ఈ పాస్ మిషన్ ద్వారా అందుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, ఏఈవో పాల్గొన్నారు.



మందమర్రి : మహాత్మా జ్యోతి బా పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం, నాయకులు



సీసీసీ నస్పూర్ : నస్పూర్‌లో బీఆర్ఎస్ నాయకులు..



బెజ్జూర్ : మండల కేంద్రంలో మాలీ సంఘం, బీఆర్ఎస్ నాయకులు

# ఘనంగా పూలే జయంతి

**మహాత్మా జ్యోతి బా పూలే జయంతి వేడుకలను జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా పార్టీలు, సంఘాలు, నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు కూడళ్లలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను కొనియాడారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.**

మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్లలో పూలే చిత్రపటాలకు కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే పూలమాల వేసి, నివాళులర్పించారు. మంచిర్యాలలోని సాయికుంట బీసీ బాలుర సమీకృత వసతి గృహంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, నితీశ్, హాస్టల్ సిబ్బంది ఆధ్వర్యంలో.., నస్పూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం వద్ద పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, మాజీ కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు రామస్వామి, పెద్దపల్లి కోటిలింగం, పంబాల ఎర్రయ్య, నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి మేరుగు పవన్, నాయకులు ఆకునూరి సంపత్‌కుమార్, పానుగంటి సత్తయ్య, కుర్మిల్ల మోహన్, మేడం తిరుపతి, పెరుమాళ్ల జనార్దన్, అడ్లకొండ రవిగౌడ్, వీర్ల తిరుమల్‌రావు, కుమ్మం రాజేశ్వర్‌రెడ్డి, పెట్టం నరేశ్, బండారి తిరుపతి, పెద్దపల్లి రామన్న, మంత్రి ప్రకాశ్, కాటం రాజు, కందుల ప్రశాంత్, నోముల నరేందర్ రెడ్డి, సజ్జు పాల్గొన్నారు. సీసీసీ టౌన్‌షిప్‌లో మాజీ ఎంపీటీసీ కోండ్ర లింగయ్య, దళిత సంఘం నాయకుల ఆధ్వర్యంలో.., బాలుర పాఠశాల మైదానంలో కుమ్రం భీం సేవా సమితి డైరెక్టర్ చిలువేరు పున్నం ఆధ్వర్యంలో.., బీసీ భవన్‌లో బీసీ ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యంలో.., మందమర్రి పట్టణంలోని సింగరేణి గ్రీన్‌పార్క్ సమీపంలో గల సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్ రావుతో కలసి మందమర్రి ఏరియా జీఎం జీ దేవేందర్ నివాళులర్పించారు. అలాగే సీఈఆర్ క్లబ్‌లో వేడుకలను జీఎం ప్రారంభించారు. పట్టణంలోని మనోవికాస్ పాఠశాలలో, సింగరేణి ఏరియా వర్క్‌షాప్‌లో, జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో.., శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఆఫీస్‌లో జీఎం ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో.., ఎంవీటీసీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్.., ఆర్కే 6గనిపై ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ.., ఆర్కే 7గనిపై ఏజెంట్ రాజేందర్, మేనేజర్ తిరుపతి ఆధ్వర్యంలో.., కోటపల్లి కేజీబీవీలో ప్రత్యేకాధికారి హరిత ఆధ్వర్యంలో.., చెన్నూర్ పట్టణంలో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, జడల మల్లేశ్, అరీఫ్, నెన్నల భీమయ్య, చిరంజీవి, ఖాజా ఖమ్రుద్దీన్, తాటికొండ సురేశ్, పుప్పాల ప్రవీణ్ ఆధ్వర్యంలో, కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సర్వర్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. కెరమెరి మండల కేంద్రంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, బారేమోడిలో పూలే సంఘం నాయకులు జెండా ఆవిష్కరించారు. ఎస్ఐ గుంపుల విజయ్, మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మునీర్ అహ్మద్, మాజీ వైస్ ఎంపీపీ అబూల్ కలాం, మాలీ సంఘం మండలాధ్యక్షుడు కావుడే తులసీరాం పాల్గొన్నారు. రెబ్బెన మండలం గోలేటిలోని బెల్లంపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం విజయభాస్కర్‌రెడ్డి, బీసీ లైజన్ ఆఫీసర్ మధూకుమార్.., సీహెచ్‌పీలో సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్.., నవేగాంలో మాలీ సంఘం.., ఖైర్‌గూడ ఓసీపీ, గోలేటి జీఎం కార్యాలయంలో నిర్వహించారు. కాగజ్‌నగర్ మండలం కోసినిలో సీనియర్ సిటిజన్స్.., అలాగే తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు పర్శా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో.., టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, ఉపాధ్యక్షురాలు ప్రీతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలే సాయికృష్ణ ఆధ్వర్యంలో.., బెజ్జూర్ మండల కేంద్రంలోని మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ, మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అశోక్, బాబురావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బూస సారయ్య, సీనియర్ నాయకుడు మొహ్మద్ ఖాజా మోహినుద్దీన్ ఆధ్వర్యంలో.., దహెగాం మండలం ఇట్యాలలో మాలీ సంఘం ఆధ్వర్యంలో.., జైపూర్‌లోని ఎస్టీపీపీలో ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో.., కౌటాల మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద విగ్రహానికి ఎంఈవో గావుడే హన్మంతు.., ముత్తంపేటలో మాలి సంఘం.., కాసిపేట 1 ఇంక్లైన్ గనిపై మేనేజర్ భూశంకరయ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేశ్, ఎస్సీ, ఎస్టీ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి కనుకుల తిరుపతి, ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్ దాస్, టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ బైరి శంకర్, సోలంకి శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ రాజేందర్.., అలాగే చింతలమానేపల్లి మండలంలో నిర్వహించారు.

## సమర్థవంతంగా నిర్వహించాలి

నస్పూర్, ఏప్రిల్ 11 : జిల్లాలోని పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. టీబీ ముక్త్ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 2025 పూర్తయ్యేలోగా క్షయ రహిత పంచాయతీలుగా మార్చాలని తెలిపారు. 22 వరకు కొనసాగనున్న పోషణ పక్షోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు, ఎదుగుదలపై కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. రేషన్‌కార్డు పరిశీలన యాప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షల లోపు వార్షిక ఆదాయంతో పాటు, అర్హతలు గల వారిని గుర్తించాలని తెలిపారు. అధికారులు వెంకటేశ్వర్‌రావు, రాజేశ్వరి, పురుషోత్తం తదితరలు పాల్గొన్నారు.

జిల్లాలో 14న అంబేద్కర్ జయంతిని అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో హెలిప్యాడ్, పరిసరాలు, వాటరింగ్ పనులు చేపట్టాలని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 108 అంబులెన్స్, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 129లో అంశాల పునః పరిశీలనపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో పూర్వ గ్రామ రెవెన్యూ అధికారులు జీవో నెంబరు 129 అమలుపై దరఖాస్తు అందజేశారు. వీఆర్వోలను జీవో నంబర్ 12 ద్వారా ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయగా, తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు ప్రభుత్వం జీవో 129 ద్వారా ఆప్షన్ పద్ధతి తీసుకునే సందర్భంలో గత అనుభవం, సీనియారిటీ, ఉద్యోగోన్నతుల విషయంలో స్పష్టత లేనందున తమకు తగు న్యాయం చేయాలని కోరారు.

కన్నెపల్లి, ఏప్రిల్ 11 : కన్నెపల్లి మండలంలో కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటించారు. టేకులపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్‌కు సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, జీపీ కార్యాలయాన్ని సందర్శించారు. నిర్మాణంలో ఉన్న జీపీ, పీహెచ్‌సీ భవనాల పనులు పరిశీలించారు. తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్‌ను సందర్శించారు. చర్లపల్లిలో ప్రాథమిక పాఠశాలను సందర్శించి, ప్రహరీ, అదనపు తరగతి గదిని పరిశీలించారు.

## కేతిని సెక్షన్ అడవుల్లో పరిశీలన

చింతలమానేపల్లి, ఏప్రిల్ 11 : ఖర్జెల్లి అటవీ శాఖ రేంజ్ పరిధి కేతిని సెక్షన్ అడవిలో శుక్రవారం కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్ బొబడే సందర్శించారు. అక్కడి అడవిని ఆనుకొని ఉన్న ప్రాంతంలో గల భూమి తమదేనని, అందులోని పెద్ద పెద్ద టేకు చెట్లు సహా చిన్న సైజులో ఉన్న చెట్లు కొట్టేందుకు పర్మిషన్ ఇవ్వాలని గతంలో పట్టేదారు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయంలో పలుమార్లు అటవీ, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే చేశాయి. ఈ క్రమంలో శుక్రవారం ఎఫ్‌డీవో మరోసారి సందర్శించారు. 17, 18, 19, 20 సర్వే నంబర్లలోని ఏడెకరాలకు పైగా భూమిలో ఇప్పటికే అధికారులు సుమారు రెండు వందలకుపైగా టేకు చెట్లకు నంబరింగ్ చేశారు. గతంలోనే ఫెన్సింగ్ పోల్స్ హద్దులు వేశారు. వీటిని ఎఫ్‌డీవో పరిశీలించారు. ఒక్కో చెట్టు ఎంత ఎత్తులో ఉంది, ఎంత సైజులో ఉంది అన్న వివరాలు నమోదు చేశారు. వాస్తవ పరిస్థితిని తెలుసుకొని నమోదు చేసేందుకు సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇక్కడ కొట్టేసిన చెట్లు సుమారు 50 ఏళ్లవిగా గుర్తించామని చెప్పారు. అప్పటి నుంచి ఈ భూమి కల్టివేషన్ చేయలేదన్నారు. ఈ విషయమై పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఎఫ్‌ఆర్వో ఇక్బాల్ హుస్సేన్, సెక్షన్ ఆఫీసర్ మోహన్ తదితరులున్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, ఏప్రిల్ 11 : నిరుద్యోగ యువతీయువకులు రాజీవ్ యువ వికాసంను సద్వినియోగం చేసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. వాంకిడి ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం సహాయ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. 14 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. అనంతరం మండలంలో ఇప్పటివరకు(ఎల్ఆర్ఎస్)కు వచ్చిన దరఖాస్తుల వివరాలను జీపీ కార్యదర్శి శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మండల కేంద్రంలోని (డీఆర్‌డిపో) చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రియజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, అధికారులున్నారు.

దండేపల్లి, ఏప్రిల్ 11 : స్వయం ఉపాధి కోసం యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్ అన్నారు. దండేపల్లి ఎంపీడీవో కార్యాయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఆన్‌లైన్ చేయడంలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, అధికారులు ఉన్నారు.

## వేసవి సెలవుల్లో జాగ్రత్త

లక్షెట్టిపేట, ఏప్రిల్ 11 : వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలపై జాగ్రత్తగా ఉండాలని లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం గోదావరి పరీవాహక ప్రాంతం కాబట్టి, పిల్లలు గోదావరికి, వ్యవసాయ బావుల్లో ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాల సూచించారు. నీడ పట్టున ఉండే ఆటలు ఆడుకునేలా చూసుకోవాలని తెలిపారు.చూసుకోవాలన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోటపల్లి, ఏప్రిల్ 11 : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోటపల్లి ఎస్ఐ రాజేందర్ సూచించారు. రొయ్యలపల్లిలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణ, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, మూఢ నమ్మకాల నిర్మూలన, మహిళల భద్రత, డయల్ 100 తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

## ప్రతీ కుటుంబానికి పని కల్పించాలి

వాంకిడి, ఏప్రిల్ 11 : జాబ్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి ఉపాధి హామీ పని కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీవో జావీద్, ఏపీవో శ్రావన్‌కుమార్, ఈసీ మోహషిన్, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ప్రారంభం

దండేపల్లి, ఏప్రిల్ 11 : మేదరిపేటలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్ఐ తహసినుద్దీన్, దాత లింగాల శ్రీమతి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చొప్పదండి రమేశ్, యెలుగూరి వేణు, మల్లికార్జున్, గోవర్ధన్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## సామగ్రికి 15న వేలం

లక్షెట్టిపేట, ఏప్రిల్ 11 : లక్షెట్టిపేట సబ్‌జైలులో సామగ్రికి 15న ఉదయం 11:30 గంటలకు జైలు ఆవరణలో జిల్లా సబ్ జైళ్ల అధికారి సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు జైలర్ టీ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.525 ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు తనను నేరుగా గానీ, 90148 47478 నంబర్‌ను గానీ సంప్రదించాలని పేర్కొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనలో జాన్సన్‌నాయక్



పూజలు చేస్తున్న భూక్యా జాన్సన్‌నాయక్

జన్నారం, ఏప్రిల్ 11 : మండలంలోని కిష్టాపూర్‌లో శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముక వ్యాపారవేత్త మాదాడి పూర్ణచందర్‌రావు, మండలాధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, ఫజల్‌ఖాన్, ఆనందం, శ్రీనివాస్, రాజేశ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

## లైజనింగ్ అధికారికి సన్మానం

మందమర్రి, ఏప్రిల్ 11 : మందమర్రి ఏరియా లైజనింగ్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎండీ ముస్తఫాను బీసీ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. ఏరియా జీఎం కార్యాలయంలోని చాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, బీసీ అసోసియేషన్ నాయకులు రాజు, పీ శ్రీధర్, సలేంద్ర సత్యనారాయణ, మేడిపల్లి సంపత్, మద్దెల శంకర్, సీవీ రమణ, రాజేశ్వర్ రావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ఐటీఐలో జార్జిరెడ్డి వర్ధంతి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 11 : శ్రీరాంపూర్ ఐటీఐలో శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పేగర సికిందర్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యరకమంలో నాయకులు శశికుమార్, మోహన్, శ్రావ్య, కావేరి నీఆజ్ పాల్గొన్నారు.

## నిరంతర సాధనతో ఉత్తమ ఫలితాలు

రెబ్బెన, ఏప్రిల్ 11 : విద్యార్థుల నిరంతర సాధనతో పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పెడుతుందని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటిటౌన్‌షిప్‌లో గల సింగరేణి హైస్కూల్‌లో శుక్రవారం ఉచిత పాలిసేట్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, హెచ్ఎం రవితేజ, ఉపాధ్యాయుడు ఆర్లరెడ్డి, పీఈటీ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## దోషులను శిక్షించాలి

కౌటాల, ఏప్రిల్ 11 : సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే-సావిత్రి బాయి పూలే విగ్రహాలను అవమానపర్చి వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని మాలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విగ్రహాల వద్ద నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. కార్యాలయం ఎదుట ధర్నా చేసి, సిబ్బందికి వినతి పత్రం అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నికాడే గంగారాం, కౌటాల, సిర్పూర్(టీ) మండలాల నాయకులు పాల్గొన్నారు.

## చలి వేంద్రం ప్రారంభం

జన్నారం, ఏప్రిల్ 11 : పద్మశాలీ పొనకల్-జన్నారం పట్టణ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగడిబజార్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎస్ఐ రాజవర్ధన్ ప్రారంభించారు. ఎంఈవో నడిమెట్ల విజయ్‌కుమార్, కార్యదర్శి రాహుల్, పద్మశాలీ పట్టణాధ్యక్షుడు చెట్పెల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడు కందుల రమేశ్, ప్రధాన కార్యదర్శి అయోరు శ్రీనివాస్, దోమల భాస్కర్, అంజన్న, నరేందర్, రవీందర్, రాము, సీ రాజమౌళి పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్ఐ రాజవర్ధన్

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 11 : రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మంచిర్యాల జీఆర్పీ ఎస్ఐ మహేందర్ శుక్రవారం తెలిపారు. మృతుడు 35 నుంచి 40 ఏండ్ల మధ్య ఉంటాడని, 5.4 అడుగుల ఎత్తు, తెలుపు, నీలి రంగు షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని, శరీరం ముక్కలైపోయి గుర్తు పట్టలేని పరిస్థితిలో ఉందని వివరించారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన మార్చురీ గదిలో భద్రపరిచిపట్లు, ఎవరికైనా వివరాలు తెలిస్తే 96186 89879, 87126 58596 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

## మృతదేహం లభ్యం

బెల్లంపల్లి, ఏప్రిల్ 11 : మండలంలోని ఆకెనపల్లి శివారులో శుక్రవారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం గుర్తించినట్లు తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. మామిడి శ్రీనివాస్ పొలంలోని చింతచెట్టుకు ఎర్ర రంగు టవల్‌తో ఉరి వేసుకొని ఉన్నాడని, సుమారు 45 ఏండ్లు ఉంటాయని పేర్కొన్నారు. నీలం రగు బనియన్, నీలం రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు వెల్లడించారు. ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమచారం అందించాలని సూచించారు.

## స్కూటీ స్వాధీనం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 11 : కాగజ్‌నగర్ పట్టణంలో దొంగలించబడ్డ స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఇటీవల స్కూటీ దొంగతనానికి గురైందని బాధితుడు ఫిర్యాదు చేశాడని, ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గాంధీనగర్‌కు చెందిన 8వ, 10వ తరగతి విద్యార్థులను అదుపులో తీసుకొని విచారించినట్లు తెలిపారు. స్కూటీ ఇంట్లో ఎవరికీ తెలియకుండా వేర్వేరు ప్రాంతాల్లో నడిపేవారని స్పష్టం చేశారు. స్కూటీ స్వాధీనం చేసుకొని, వారిని జువెనైల్ కోర్టులో హాజరుపర్చనున్నట్లు వెల్లడించారు.

## నలుగురిపై కేసు

కాసిపేట, ఏప్రిల్ 11 : బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారు సోమగూడెంలోని సర్వే నెంబర్ల(2/2, 2/45, 2/49, 2/15)లోని 10.18 ఎకరాలు నకిలీ పట్టాలు సృష్టించిన వారిపై కేసు నమోదు చేసినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. లంబాడీ తండాకు చెందిన బానోతు ఈశ్వరి, అజ్మీరా జమున, అజ్మీరా రాజిలి, కున్సోత్ మోతీ.. సింగరేణి కేకే ఓసీలో భూమి పోయిందని తప్పుడు పట్టా పాసు పుస్తకాలు, మీసేవ పహణీలు సృష్టించి పరిహారం పొందేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ చేయగా, నకిలీ పట్టాలు సృష్టించినట్లు తేలడంతో ఆర్డీవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిపై..

బెల్లంపల్లి, ఏప్రిల్ 11 : ఇంట్లో గంజాయి మొక్కలు పెంచుతున్న కన్నాల బస్తీకి చెందిన దేవి రాహుల్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. రాహుల్‌కు గంజాయి సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో తాను సేవించడమే కాకుండా విక్రయించి డబ్బు సంపాధించవచ్చని తన ఇంటి ఆవరణలో రెండు గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. సమాచారం మేరకు ఎస్ఐ రాకేశ్ తనిఖీ చేశారు. మొక్కలను స్వాధీనం చేసుకొని రాహుల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

కన్నెపల్లి, ఏప్రిల్ 11 : భీమిని మండలం చిన్నగుడిపేట శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.6,700 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## గంజాయి కేసులో ఒకరు..

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 11 : గంజాయి కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ముత్తె ప్రవీణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. టౌన్ ఎస్ఐ వినీత తన సిబ్బందితో రాళ్లవాగు ఏరియాలో పెట్రోలింగ్ చేస్తుండగా, పాత మంచిర్యాలకు చెందిన కోట దినేశ్ నాగేందర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. 170 గ్రాముల ఎండు గంజాయి గుర్తించినట్లు, వెంటనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## తల్లీకొడుకులకు గాయాలు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 11 : జిల్లా కేంద్రంలో క్వారీ రోడ్డు ఏరియాలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ర్యాలీగడ్‌పూర్‌కు చెందిన తల్లీకొడుకులు మంగురపు చిన్నక్క, మంగురపు శ్రీకాంత్‌కు గాయాలైనట్లు పట్టణ ఎస్ఐ వినీత శుక్రవారం తెలిపారు. తల్లీకొడుకులు బైక్‌పై మంచిర్యాల నుంచి గడ్‌పూర్ వెళ్తుండగా, అండాలమ్మ కాలనీ దాటిన తర్వాత ఫార్చునర్ కారు వేగంగా వచ్చి వీరిని ఢీ కొట్టింది. దీంతో గాయాలయ్యాయి. వీరిని దవాఖానకు తరలించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## పోలీసులకు క్యాష్ రివార్డు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 11 : రెండు గంజాయి కేసులో చాకచక్యంగా వ్యవహరించి, నేరస్తులను పట్టుకున్న కేసులో సిబ్బందికి క్యాష్ రివార్డ్ అందజేసినట్లు మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. పట్టణ సీఐ ప్రమోద్ రావు, క్రైమ్ పార్టీ సిబ్బంది మహేశ్ బాబు, తిరుపతి, బ్లూకోల్ట్ సిబ్బంది గణేశ్, హోమ్ గార్డు సంపత్‌కు రివార్ట్ అందజేశారు.

## 'ఆత్మహత్యగా చిత్రీకరణ'

హాజీపూర్, ఏప్రిల్ 11 : టీకన్నపల్లి గ్రామానికి చెందిన కంది శ్రీనివాస్-కవిత కూతురు శృతిని అత్తామామలు, భర్తే హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. శుక్రవారం శృతి తల్లిదండ్రులను ఆయన కలిశారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. ఐదు ఫీట్ల ఎత్తు ఉన్న బాత్రూంలో ఐదు ఫీట్ల ఎత్తు ఉన్న శృతి ఉరేసుకోవడం ఎలా సాధ్యమవుతుందని అన్నారు. అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు, హత్యచేసి, ఆత్మహత్యగా చిత్రీకరించిన భర్త సాయికుమార్, అత్తామామలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీపీఎం కార్యవర్గ సభ్యులు ప్రకాశ్, దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్, రాములు తదితరులున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాసిపేట, ఏప్రిల్ 11 : కాసిపేట మండలంలో శనివారం ఉదయం 9:30 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపూర్ 33 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాగజ్‌నగర్, ఏప్రిల్ 11 : కాగజ్‌నగర్ పట్టణంలో సబ్‌స్టేషన్ నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ కమాలాకర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.